
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.4 ॥ కనిష్ఠం 24.2



నిజామాబాద్
జిల్లా వార్తలు

ఆదివారం 25 మే 2025



• కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం



• డొంకేశ్వర్‌లో వర్షానికి తడిసిన సజ్జ పంట

వదలని వర్షం

- జిల్లావ్యాప్తంగా జోరు వాన
- అత్యధికంగా నవీపేటలో 48.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- వరుస వర్షాలతో పలుచోట్ల తడిసిన ధాన్యం.. దెబ్బతిన్న సజ్జ పంట
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- ఎస్సారెస్పీకి మొదలైన ఇన్‌ఫ్లో
- వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు



నిజామాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాను వర్షాలు వదలడం లేదు. వరుసగా నాలుగు రోజులపాటు వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ వర్షాలు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ధాన్యా న్ని కాపాడుకునేందుకు రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యంతోపాటు సజ్జ, నువ్వు పంటలను కాపాడుకునేందుకు తిప్పలు పడుతున్నారు. మరోవైపు.. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వానాకాలం పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. పెద్దఎత్తున సాగు చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. వర్షాలు మరో మూడు రోజుల పాటు పడనుండటంతో ధాన్యాన్ని తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం సైతం జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. జిల్లాలో సరాసరి 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా నవీపేట మండలంలో 48.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో నాలుగు రోజుల్లోనే సరాసరి 100 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం.. 21 మండలాల్లో సగటు వర్షపాతానికి మించి వర్షం కురిసింది. 12 మండలాల్లో సగటు వర్షపాతం నమోదైంది. గడిచిన కొన్నేళ్లుగా మే నెలలో ఇలాంటి వర్షాలు పడలేదని అధికారులు చెప్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితలద్రోణి వల్ల ఈ వర్షాలు పడుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

జిల్లాలో నాలుగు రోజుల పాటు పడిన అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయింది. జిల్లా వ్యాప్తంగా 35వేల ఎకరాల్లో రైతులు సజ్జను సాగు చేశారు. పంట చేతికి రావడంతో కొంత మంది రైతులు కోసి వేయగా.. మరికొంత మంది కోసేందుకు సిద్ధమయ్యారు. వర్షాలతో సజ్జ కూడా తడిసిపోవడంతో.. రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

ఖరీఫ్ సాగు అంచనా 5.61 లక్షల ఎకరాలు

జిల్లాలో ఈ వానాకాలంలో మొత్తం 5లక్షల 61వేల 266 ఎకరాల్లో పంటలు వేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జూన్ ఆరంభం నుంచి మొదలయ్యే వర్షాలకు అనుగుణంగా ఈ పంటలపై అంచనా వేశారు. ఈ దఫా పదిరోజుల ముందుగానే వర్షాలు పడటంతో ముందస్తుగా పంటలు సాగు అవుతాయని అంచనాకు వస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ నిర్ణయించిన ప్రకారం 4లక్షల 37వేల 135 ఎకరాల్లో వరిసాగు అవుతుందని అంచనా వేశారు. సహకార సొసైటీల ద్వారా వరి విత్తనాలను అందుబాటులో ఉంచారు. వర్ని, మోస్రా, చందూర్, రుద్రూర్, కోటగిరి, ఎడపల్లి మండలాల పరిధిలో ఇప్పటికే నారుమల్లు సిద్ధం చేసిన రైతులు జూన్ ఆరంభం నుంచి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడటంతో దుక్కులను సిద్ధం చేస్తున్నారు. వర్షాలు ముందుగానే పడటం భూమి అనుకూలంగా మారడంతో ఆరుతడి పంటలను కూడా వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో పసుపు సాగు కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఎస్సారెస్పీకి స్వల్ప వరద


ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద వస్తోంది. ప్రతీరోజు 2,789 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. నాలుగు రోజుల పాటు పడిన వర్షాల వల్ల పంటలు వేసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో ఆరుతడి పంటలతో పాటు ఇతర పంటలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసిన రైతులు వర్షాలు తగ్గగానే వేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు.

ఈ యేడు జిల్లాలో 25వేల ఎకరాల్లో పసుపు

ఈ సంవత్సరం 25వేల ఎకరాలలో పసుపు సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతోపాటు మొక్కజొన్న పంట కూ డా వేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. మొక్కజొన్నకు డిమాండ్ రావడంతో పసుపుతోపాటు అంతర పంటగా సాగు చేసేందుకు ఎక్కువమంది రైతులు మొగ్గు చూపుతున్నారు. విడిగా కూడా ఎక్కువ మొత్తంలో వేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. జిల్లాలో ఈ పంట 55వేల ఎకరాల వరకు సాగు అవుతుందని అంచనా వేశారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలు తగ్గగానే మొక్కజొన్న వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. గతంలో సోయా పంట అత్యధికంగా సాగు చేసిన రైతు లు కూడా ఈ దఫా మొక్కజొన్నకు మొగ్గు చూపుతున్నారు. సోయా కూడా జిల్లాలో 38వేల ఎకరాల వరకు సాగు అవుతుందని అంచనా వేస్తున్నారు. జిల్లాలో వర్షాలు మరో 3రోజుల పాటు పడే అవకాశం ఉండటంతో జూన్ ఆరంభం నుంచి ఎక్కువ మొత్తంలో పంటలు వేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. అవసరమైన ఎరువులు, విత్తనాలను సొసైటీల పరిధిలో అందుబాటులో ఉంచారు. మరిన్ని వర్షాలు కురిస్తే సాగు జూన్ ఆరంభంలోనే మొదలుకానుంది.

వర్షానికి తడిసిన
ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- అధికారులు తక్షణమే కొనుగోళ్లకు చర్యలు చేపట్టాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



నిజామాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదలచేశారు. అకాల వర్షాలకు ఉమ్మడి జిల్లా పరిధిలో ధాన్యం తడిసిపోవడంతో పాటు మొలకెత్తిందని, ఇప్పటికీ ధాన్యం రోడ్ల వెంట, కళ్లాల వెంట తడిసిపోయి ఉందని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనేవారు లేక రైతులు గోస పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కొనుగోలుపై దృష్టిపెట్టడం లేదని, అందాల పోటీలకు ఇస్తున్న ప్రాధాన్యత ధాన్యం కొనుగోలు పట్ల చూపడం లేదని ఈ సందర్భంగా విమర్శించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని చెప్తున్నది వట్టి మాటేనని, కొనుగోలుచేసి కూడా తరలించకపోవడంతోనే ధాన్యం తడిసిపోయిందని తెలిపారు. సంచుల్లో ఉన్న ధాన్యం కూడా మొలకెత్తిందని, ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని చెప్పారు తడిసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తే ఎక్కువ మొత్తంలో తరుగు తీస్తున్నారని, ఈ విషయాన్ని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టించుకొని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ధాన్యంతోపాటు అకాల వర్షాలకు నష్టపోయిన సజ్జ, నువ్వు పంట రైతులను కూడా ఆదుకోవాలని, దెబ్బతిన్న పంటలకు అనుగుణంగా నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. కొన్న సన్నరకం ధాన్యానికి బోనస్ క్వింటాకు రూ.500 చొప్పున వెంటనే ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

భీమ్‌గల్‌లో ఆపరేషన్ సిందూర్
విజయోత్సవ ర్యాలీ

• పెద్దసంఖ్యలో పాల్గొన్న యువకులు

భీమ్‌గల్, మే 24 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి బదులుగా భారత ఆర్మీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయంపై భారతీయ జనతా పార్టీ భీంగల్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లి కార్జున్‌రెడ్డి పాల్గొని జాతీయ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణ కేంద్రంలో ప్రధాన వీధుల గుండా కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్కన్నగారి మోహన్, మండల నాయకులు మధు, ఆరే రవీందర్, యోగేశ్వర నర్సయ్య, సంధ్యరాజ్, రజనీకాంత్, ప్రమోద్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, భీమ్‌గల్ యువకులు

మహిళా శక్తికి అహల్యాబాయి స్ఫూర్తి: అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ కల్చరల్, మే24 (ఆంధ్రజ్యోతి): లోకమాత మహారాణి అహల్యాబాయి హోల్కర్ జీవితం నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయంలో జరిగిన అహల్యాబాయి 300 జయంతి ఉత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అహల్యాబాయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు గొప్ప మార్గదర్శకురాలిగా, నిర్మాతగా సేవలు అందించారని అన్నారు. ఆమె భారతదేశం అంతటా వందలాది దేవాలయాల్లో ధర్మశాలలు నిర్మాణం చేసి భక్తులకు ఆశ్రయం ఇచ్చారని అన్నారు. ద్వారక నుంచి మొదలుకొని వారణాసి, ఉజ్జయిని, నాసిక్, గయా, వైద్యనాథ్ వంటి ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం ఎన్నో కార్యక్రమాలు చేశారని అన్నారు. ప్రసిద్ధ కాశీ విశ్వనాథ ఆలయ పునరుద్ధరణ, మరమ్మతులకు ఆమె ఎంతగానో కృషి చేశారని అన్నారు. పాలనలో పక్షపాతం లేకుండా న్యాయ పరిపాలన నిర్వహించడంలో ఖ్యాతిని సంపాదించారన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ప్రవళిక, పోతన్కర్ లక్ష్మీనారాయణ, జ్యోతి, స్రవంతి, బీజేపీ మండల అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

వైభవంగా వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి , మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వర సామి ఉత్సవాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి పల్లకిని భక్తులు కొండ చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నూతన ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

గ్రామ పాలన అధికారి ఎంపిక
పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెల్లడి
- పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ అమలు: సీపీ

నిజామాబాద్‌అర్బన్, మే24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారి ఎంపిక పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్నిఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరుగనున్న రాత పరీక్షకు జిల్లాలో 331 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. గ్రామపాలన అధికారుల రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై శనివారం హైదరాబాద్ నుంచి సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జీపీవో పరీక్ష నిర్వాహణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. 331మంది అభ్యర్థులు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఒక్కో గదిలో 32మంది అభ్యర్థుల చొప్పున మొత్తం 11గదుల్లో పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికతో చర్యలు చేపట్టామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ తగిన పోలీసు బందోబస్తుకు ఆదేశించామన్నారు. అదేవిధంగా ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఉండేలా చర్యలు తీసుకున్నామని, పరీక్ష సమయానికి అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులకు సూచనలు చేశామన్నారు. పరీక్ష ముగిసిన మీదట సీల్ వేసిన జవాబు పత్రాల బెండల్స్‌ను మూల్యాంకన కేంద్రానికి పంపించేలా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రంలో తాగునీటి వసతి, సరిపడా ఫర్నీచర్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. దివ్యాంగ అభ్యర్థులు పరీక్ష రాసేందుకు స్క్రైబ్‌లు 10వ తరగతిలోపు విద్యార్హత కలిగి ఉండాలని సూచించారు. వీసీలో అదన పు కలెక్టర్ కిరణ్‌కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆర్‌డీవో రాజేంద్రకుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం వద్ద అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు

గ్రామ పాలన అధికారి పరీక్ష నేపథ్యంలో ఆదివారం గిరిరాజ్ కళాశాల వద్ద అండర్ సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్‌ను అమలు చేయనున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. పరీక్ష కేంద్రం పరిసరాలలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది గుమిగూడవద్దని, నిషేధిత వస్తువులతో తిరగవద్దని చెప్పారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పరీక్ష కేంద్రం వద్ద పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని ఆయన ఆదేశాలు ఇచ్చారు.

మూడు నెలల రేషన్ కోటా ఒకేసారి పంపిణీ

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా వచ్చే మూడు మాసాలకు సంబంధించిన రేషన్ కోటాను ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం కోటాను రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డులు కలిగినవారు ఒకేసారి పొందవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు అవసరమైన అన్నిఏర్పాట్లు చేస్తున్నామని, చౌకధరల దుకాణా డీలర్లు 3మాసాల కోటాను దిగుమతి చేసుకొని వినియోగదారులకు సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. జూన్ 1నుంచి 30వ తేదీలోపు పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. బియ్యం పంపిణీలో అవకతవకలు అలసత్వానికి తావిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. వర్షాలు, వరదలు, నిల్వ సమస్యల కారణాలతో వచ్చే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. లబ్ధిదారులు ఏకకాలంలో మూడు నెలల కోటా పంపిణీ జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని పౌరసరఫరాల అధికారులకు ఆదేశించారు. బియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాలపై దృష్టి

- వర్షాలకు ముందే పనులు చేసేందుకు ఏర్పాట్లు
- డ్రైనేజీలు, రోడ్ల మరమ్మతులు చేస్తున్న కార్పొరేషన్ అధికారులు



నగరంలో డ్రైనేజీలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కమిషనర్

నిజామాబాద్, మే 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరుసగా గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మున్సిపాలిటీల పరిధిలోని పలు ప్రాంతాల్లో వరద నీరు చేరుతోంది. వరద చేరుతున్న డ్రైనేజీలు, రోడ్లపై మున్సిపల్ అధికారులు దృష్టిపెట్టారు. వానాకాలం ఆరంభం ముందే పనులు చేసేందుకు నిమగ్నం అయ్యారు. నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలో పలు పనులు చేపడుతున్నారు. గత వర్షాకాలంలో ఏర్పడిన ఇబ్బందులను అధిగమించేందుకు సిద్ధమవుతున్నారు. మున్సిపాలిటీలో ఉన్న నిధులతో వెచ్చించి డ్రైనేజీలను క్లియర్ చేయడంతోపాటు అవసరమైన చోట్ల వెడల్పు చేస్తున్నారు. గత సంవత్సరం భారీ వర్షాలకు ఈ మున్సిపాలిటీల పరిధిలో పలు కాలనీలో నీరు చేరి ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఆయాకాలనీలో ఈ పనులను చేస్తున్నారు. వీటితోపాటు కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను కూడా పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

మునుగుతున్న లోతట్టు ప్రాంతాలు

జిల్లాలోని నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలో ప్రతీ ఏడాది వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. రోజుల తరబడి వరదనీరు రోడ్లపై, ఇళ్ల చుట్టూ ఉండటం వల్ల కాలనీవాసులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం ఆయా కాలనీలను మున్సిపాలిటీ పరిధిలో గుర్తించడంతోపాటు పనుల కోసం నిధులను కేటాయించారు. డివిజన్, వార్డుల వారిగా పనులను చేపట్టారు. రాష్ట్రప్రభుత్వం ఇస్తున్న నిధులతోపాటు అమృత్ పథకం కింద వచ్చిన నిధులను కూడా వెచ్చించి డ్రైనేజీ, రోడ్డు పనులను చేపట్టారు. మున్సిపాలిటీల పరిధిలో ఈ పనులను చేస్తున్నారు. నిజామాబాద్ నగర కార్పొరేషన్ పరిధిలో ప్రతీ సంవత్సరం వర్షాకాలం సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అర్సపల్లి, గంజ్, రైల్వేపార్క్, బోధన్ రోడ్, ఆర్అండ్‌బీ కల్వర్ట్, గౌతంనగర్, ఆదర్శనగర్, గుమస్తా కాలనీ, డి52, 54 కెనాల్, న్యాల్‌కల్ రోడ్డు ప్రాంతంలో ఎక్కువగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ వర్షాలు పడిన సమయంలో వరద నీరు నిలిచిపోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పూలాంగ్‌వెంట ఉన్న ఇళ్లల్లో కూడా నీళ్లు చేరి సమస్యలు ఎదురవుతున్నాయి. గత సంవత్సరం పరిస్థితులను సమీక్షించిన అధికారులు పూర్తిస్థాయిలో చర్యలను చేపట్టారు. ఆయా కాలనీల పరిధిలో కొత్తగా డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చే నిధుల ద్వారా డివిజన్‌లకు 5 నుంచి 10లక్షలు కేటాయించి అవసరం ఉన్నచోట డ్రైనేజీ నిర్మాణం చేశారు. వర్షాకాలం కోసం 70లక్షలను వెచ్చించి ప్రస్తుతం నీళ్లు ఆగే ప్రాంతాల్లోని డ్రైనేజీలు, రోడ్లను క్లియర్ చేస్తున్నారు. జేసీబీలను పెట్టి చెత్తను తొలగిస్తున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించిన పనులను కొనసాగిస్తున్న కొత్తగా 60 కోట్లు వెచ్చించి పనులను కొనసాగిస్తున్నారు. ఈ వర్షాకాలంకు ముందే నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండటంతో లోతట్టు కాలనీలో ఇబ్బందులు లేకుండా చర్యలను తీసుకుంటున్నారు. బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని రాకాసిపేటతోపాటు ఇతర కాలనీలో వర్షాకాలం సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 47కోట్లతో పనులను చేపడుతున్నారు. వీటిలో 20 కోట్లను వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ పనులకు టెండర్లను పూర్తిచేశారు. తిర్మల్‌నగర్, విద్యానగర్, సిక్కువాడితో పాటు ఇతర కాలనీలో నీరు వచ్చే అవకాశం ఉండడంతో వాటిని క్లియర్ చేస్తున్నారు. భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో కూడా నిధులను వెచ్చించి డ్రైనేజీ పనులను కొనసాగిస్తున్నారు. నిజామాబాద్ నగర కార్పొరేషన్ పరిధిలో వర్షాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల్లో పనులు చేస్తున్నామని కమీషనర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఎక్కడా నీరు చేరకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.



భారీ వర్షానికి బోధన్ రోడ్డుపై నిలిచిన వరద నీరు (ఫైల్)

ఘనంగా రైతు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

నిజామాబాద్ రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ మండలం మాధవనగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సహకార అధికారి ఎన్.శ్రీనివాస్‌రావు పాల్గొని మాట్లాడుతూ సహకార ఉద్యమ చరిత్ర దాని ప్రస్తుత పురోగతి మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థల యొక్క స్థాపన, విధివిధానాలు, నిర్వాహక పద్ధతులు, రైతులకు లభించే ప్రయోజనాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరస్వతి, రిజిస్ట్రార్ పోశన్న, క్లస్టర్ ఆఫీసర్ శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు దాసరి నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులు పోతరెడ్డి, డైరెక్టర్లు సాంబశివరావు, జనార్దన్, వంగ రవీందర్, మోజిరామ్, 4వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ప్రమోద్‌కుమార్, సంఘ సభ్యులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపులలో దొడ్డు బియ్యం నిల్వలు



నవీపేటలో ఓ రేషన్ షాప్‌లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలు

నవీపేట,మే24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గత నెల నుండి రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ చేస్తుంది. గతంలో పంపిణీ కోసం వచ్చిన దొడ్డు బియ్యం నిల్వలు రేషన్ దుకాణాలలో మూలనపడి ఉన్నాయి. మండలంలో 37రేషన్ దుకాణాలు ఉండగా ఇందులో సుమారు 312క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. గత మూడు మాసాలుగా సంబంధిత బియ్యం సంచులు మూలనపడి ఉండడంతో బియ్యం పురుగులు పడుతున్నాయని డీలర్లు వాపోతున్నారు. పైగా కేంద్ర ప్రభుత్వం వచ్చే జూన్ మాసం నుండి మూడు నెలలకు సరిపడ బియ్యాన్ని ఒకేసారి విడుదల చేస్తామని పేర్కొనడంతో సంబంధిత బియ్యం ఎక్కడ నిల్వ ఉంచుకోవాలో తెలియడం లేదని డీలర్లు పేర్కొన్నారు. ఈ విషయంపై మండల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మహేష్ కుమార్‌ను వివరణ కోరగా రేషన్ షాపులలో గత మూడు మాసాల క్రితం వచ్చిన దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయని జిల్లాలోని చాలా మండలాల్లో ఇదే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సంబంధిత బియ్యాన్ని తరలించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బోధన్ డివిజన్‌లో భారీ వర్షం



లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ల ముందు నిలిచిన వర్షపు నీరు

బోధన్‌రూరల్,మే24(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో కురుస్తున్న వర్షానికి పట్టణంలోని పలు వార్డులలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇది వరకే మున్సిపల్ అధికారులు డ్రైనేజీలు కట్టడంతో ఈ సారి వర్షాలకు నీరు డ్రైనేజీలోకి వెళ్లడంతో వర్షపు నీరు రోడ్లపై పారుతుంది. రాకాసిపేటలోని లోతట్టు ప్రాంతాల్లోని శివారు లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచింది. వర్షానికి శర్బత్ కెనాల్ పొంగిపొర్లడంతో మున్సిపల్ సిబ్బంది శర్బత్‌కెనాల్‌లోని చెత్తచెదారాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ సమక్షంలో చేపట్టారు. పలు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీఈ యోగేష్ సందర్శించారు. వర్షానికి ఎక్కడ కూడా నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్స్‌స్పెక్టర్‌కు ఆదేశించారు. బోధన్ డివిజన్‌లో భారీ వర్షం కురుస్తుంది. ఎడతెరిపి లేకుండా ఓ మోస్తారు భారీ వర్షం పడడంతో బోధన్ డివిజన్‌లోని అన్ని మండలాలలో వర్షపాతం నమోదైంది. గత రెండు రోజులుగా వర్షం పడడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసిన రైతులు పంటలు వేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బోధన్ డివిజన్‌లో రెంజల్ మండలంలో 28.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కోటగిరిలో 15.2మిల్లీ మీటర్లు, బోధన్‌లో 22.6మిల్లీ మీటర్లు, వర్నిలో 13.0మిల్లీ మీటర్లు, మోస్రా 14.4మిల్లీ మీటర్లు, ఎడపల్లిలో 31.0మిల్లీ మీటర్లు, రుద్రూరులో 26.6మిల్లీ మీటర్లు, చందూర్‌లో 20.0మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కల్వకుంట్ల కుటుంబం కాదు.. కలహాల కుటుంబం

● ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ఆర్మూర్ రూరల్ , మే 24(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ది కల్వకుంట్ల కుటుంబం కాస్త కలహాల కుటుంబంగా మారిందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. శనివారం ఆలూర్, ఆర్మూర్‌లలో కాంగ్రెస్ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు గత పాలనలో 10ఏళ్లలో లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీని సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం అవివేకం అన్నారు. గతంలో వారి హయాంలో కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించారని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ తిరుపతి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారచంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ జీవన్, కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్, అయ్యప్ప పాల్గొన్నారు.

ఆయిల్‌ఫామ్ తోటలో వేలాడుతున్న కరెంట్ వైర్లు

మోర్తాడ్, మే 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టక్కురి వాడ శివారులో ఆయిల్‌ఫామ్ తోటలో కరెంట్ వైర్లు వేలాడుతుండడంతో రైతులు భయపడుతున్నారు. స్థానిక రైతు పుప్పాల అశోక్‌కు చెందిన ఆయిల్ ఫామ్ చెట్లకు తగిలేలా వైర్లు తాకుతున్నాయని దీంతో ఎర్తింగ్ వస్తుందని రైతు వాపోయాడు. విద్యుత్ అధికారులకు పలుమార్లు వారి దృష్టికి తీసుకొచ్చిన పట్టించుకోవడం లేదని అశోక్ ఆరోపించారు. తోటలోకి వెళ్లాలంటేనే భయం కలుగుతుందని ఆయిల్ చెట్లకు నీరు పారించాలన్న భయం కలుగుతుందని రైతు వాపోయారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి మధ్యలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,మే24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం బోధన్‌లోని ఇందూర్ బీఈడీ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ముగింపు శిక్షణ కార్యక్రమానికి ఆయన హజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యాల అభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుటకు, బడిబాట కార్యక్రమం క్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రానున్న విద్యా సంవత్సరంలో అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం నిర్వహించాలని, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ప్రతి నెలలో ప్రతి పాఠశాలలో నిర్వహించాలన్నారు. జూన్ 6 నుంచి బడిబాట నిర్వహించాలని పాఠశాల ప్రారంభంలో సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, డీఆర్‌పీలు వెంకటేశ్వర్లు, హన్మాండ్లు, రిసోర్స్ పర్సన్‌లు సంజీవ్, శ్రీకాంత్, శ్రీహరి రెడ్డి, శ్రీధర్, పీరాజీ, సీఆర్‌పీలు విజయ్, యుసుఫ్ బాబు, విజయ, దేవానంద్, రేఖ, మండలంలోని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు లేకుండా చూడాలి

బోధన్‌రూరల్,మే24(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఇందిరమ్మ ఇళ్ల అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని 4వ వార్డు ప్రజలు బోధన్ సబ్ కలెక్టర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సొంత ఇల్లు ఆర్‌సీసీ ఉండి ఫోర్ వీల్లర్ కారు ఉన్న ఒక్క ఇంట్లోనే రెండు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ప్రజల అభ్యర్థన మేరకు సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తప్పకుండా అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జాదవ్ ప్రవీణ్, ఉస్మాన్, ఖుద్దుస్, కాలనీవాసులు గజాపాక సాగర్, ఉదయ్ కిరణ్, కనకయ్య, విజ్జు, లక్ష్మణ్ తదితరులున్నారు.

తాగునీటి కోసం గ్రామస్థుల ఆందోళన



పంచాయతీ కార్యదర్శిని ఘెరావ్ చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మే24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిక్నెల్లి గ్రామంలో వారం రోజులుగా తాగునీరు లేక అల్లాడుతున్నామని శనివారం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. గ్రామంలో రెండు బోరు మోటార్లు చెడిపోయ్యాయని, దీంతో తాగునీటికి గ్రామస్థులు అవస్థలు పడుతున్నారని అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో విసిగిపోయిన గ్రామస్థులు పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. పంచాయతీ కార్యదర్శిని ఘెరావ్ చేశారు. తక్షణమే స్పందించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని లేనియెడల సబ్ కలెక్టర్ వద్దకు వెళ్లి తమ సమస్యలను విన్నవించుకుంటామన్నారు. ఒక పక్క వర్షాలు పడుతున్న అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మరో పక్క తాగడానికి నీరు లేకపోవడం గ్రామాధికారులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బోరు మోటార్లను వెంటనే రిపేర్లు చేయించి గ్రామస్థులకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరం మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్

పెర్కిట్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల చీమన్‌పల్లి యందు 2025- 26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిచనున్నారు. ప్రిన్సిపాల్ సోమ్లా ఒక ప్రకటనలో తెలుపుతూ ఎంపీసీ, బైపీసీలలో మిగిలిన సీట్ల భర్తీ కొరకు 26వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పైకప్పు పెచ్చులూడిపడి బాలికకు గాయాలు

బాల్కొండ, మే 24(ఆంధ్రజ్యోతి): బాల్కొండ కేసీఆర్ కాలనీలోని డబు ల్ బెడ్‌రూం ఇండ్లలో శనివారం పైకప్పు పెచ్చులూడిపడి బాలికకు గా యాలయ్యాయి. మోహన్ అనే వ్యక్తికి చెందిన డబుల్ బెడ్‌రూంలో చిన్న పాటి వర్షానికి పెచ్చులూడడంతో ఏడేళ్ల ప్రీతికపై పడడంతో స్వల్ప గా యాలయ్యాయి.

'అవసరం మేరకే రసాయన ఎరువులను వినియోగించాలి'



పడిగెలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మంజు భార్గవి

వేల్పూర్, మే 24(ఆంధ్రజ్యోతి): అవసరం మేరకు మాత్రమే యూరియా, ఇతర రసాయనాల ఎరువులను వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని రుద్రూర్ ప్రాంతీయ వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు మంజుభార్గవి, దుర్గరాణిలు సూచించారు. మండలంలోని పడిగెల గ్రామ ప్రజాభవన్‌లో శనివారం జరిగిన రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అధికంగా రసాయనాల ఎరువులు వాడితే పరుగులు, తెగుల్ల ఉద్రితి పెరగడమే కాకుండా పర్యావరణ, కాలుష్యంతో పాటు పంట పెట్టుబడులు పెరిగిపోతాయన్నారు. వేసవిలో వరి ఎంట కోత తర్వాత లోతుదుక్కులు చేసుకుంటే తెగులు, పురుగుల ఉద్రితి తగ్గుతూ నేల నీటివినియోగ సామర్థ్యం పెరుగుతుందన్నారు. పంట మార్పిడి సరైనా ప్రణాళికతో చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందవచ్చని భూమికి దీర్ఘకాలిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. వర్షపు నీటిని కుంటల్లో నిల్వచేయడం ద్వారా పొలానికి అవసరమైన సమయంలో నీరు అందించవచ్చన్నారు. విత్తనాలు, ఎరువులు పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరి రశీదు లను తీసుకొని భద్రపరిస్తే కష్టకాలంలో నష్టపరిహారం పొందవచ్చన్నారు. చెట్లు నాటడం మన జీవన వ్యవస్థకు అత్యంత అవసరమైన పని అని, ఇది కేవలం పర్యావరణ పరిరక్షణకే కాదని భవిష్యత్ తరాలకు ఆరోగ్య కరమైన జీవనాన్ని అందించడానికి కీలకమైన చర్య అని అన్నారు. పచ్చి రొట్టే ఎరువుల వల్ల అనేక లాభాలు ఉంటాయని పోటాష్ ఉన్న కాంప్లెక్స్ ఎరువులను మాత్రమే వాడాలన్నారు. గ్రామ రైతులు తమ సమస్యలను వివరిస్తూ వివిధ పంటల సాగుచేయు పద్ధతులపై తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు. విత్తనశుద్ధి ప్రాముఖ్యత శుద్ధి చేసుకునే విధానాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారి ఎస్. శృతి, ఏఈవోలు సాయిరాంరాజ్, ప్రశాంత్, స్నేహశ్రీ, షబీర్, మండల పశువైద్యుడు సంతోష్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బొంబాయి గంగాధర్, గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రుద్రూరులో కార్డన్ సెర్చ్



రుద్రూరులో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

కోటగిరి,మే24(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో శనివారం నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు కార్డెన్‌సెర్చ్ కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించి 4 ఆటోలు, 97 ద్విచక్రవాహనాలు సరైన పత్రాలు లేనందున స్వాధీనం చేసుకున్నారు. ఒక ఇంట్లో అక్రమంగా లిక్కర్ అమ్ముతున్నారన్న సమాచారం మేరకు 45 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు అనుమాన స్పదంగా సంచరిస్తే సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోధన్ టౌన్, రూరల్ సీఐలు వెంకట నారాయణ, విజయ్ బాబు, రుద్రూరు సీఐ కృష్ణ, ఎస్ఐలు సాయన్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఆత్మహత్య

ఆర్మూర్ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన వడ్డెపు లక్ష్మీనర్సయ్య (40) జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గత రేండేళ్ల క్రితం భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి రాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది గ్రామంలోని ఊరచెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. సంఘటన స్థలాన్నిఎస్‌హెచ్‌వో పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

అంతంపల్లిలో టిప్పర్ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

భిక్కనూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతంపల్లి గ్రామంలో శనివారం టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో విరిగింది. గ్రామంలో విద్యుత్ సమస్య ఏర్పడింది. దీంతో గ్రామస్థులు వెంటనే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వెం టనే అప్రమత్తమైన విద్యుత్‌శాఖ ఏడీ సుదర్శన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని విరిగిన స్తంభాన్ని సిబ్బందితో పూర్తిగా తొలగించి దాని స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయించి, సమస్యను పరిష్కరించారు.

చోరీకి యత్నించిన ఇద్దరు వ్యక్తులకు దేహశుద్ధి

కామారెడ్డిటౌన్,మే 24(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ ఆలయం పక్కన గల ఓ ఇంట్లో శనివారం చోరీకియత్నించిన ఇద్దరు వ్యక్తులకు స్థానికులు దేహశుద్ధి చేశారు. అనంతరం పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో ఆ ఇద్దరిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. చోరీకి యత్నించిన వారు నిజామాబాద్‌కు చెందిన అశ్రాఫ్, ముస్కాన్‌లుగా గుర్తించారు.

తండ్రిని చంపిన తనయుడు



హత్యకు గురైన ఫకీరా

లింగంపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం అయ్యపల్లితండాలో శనివారం రాత్రి తండ్రి ఫకీరాను గొడ్డలి తో నరికి చంపాడు కొడుకు. తండా వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అయ్యపల్లితండాకు చెందిన దేవాసోత్ ఫకీరా(46)కు 20ఎండ్ల కిందట పంగీతో వివాహం జరిగింది. వీరికి కుమారుడు ప్రకాశ్‌తో పాటు కూతురు ఉన్నారు. ఫకీరా ఇటీవల కూతురు వివాహం జరిపించినట్లు వారు తెలిపారు. ఫకీరా భార్య పంగీ మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో ఫకీరా రెండోవివాహం చేసుకోవడానికి సిద్ధపడగా కొడుకు ప్రకాశ్ అడ్డుకున్నాడు. తండ్రి వివాహం విషయంలో తండ్రి కొడుకుల మధ్య సంవత్సర కాలంగా ప్రతీ రోజు గొడవ జరుగుతుందని వారు తెలిపారు. తనకు వివాహం చేయాల్సి ఉండగా తండ్రివి నువ్వు వివాహం చేసుకోవడం ఏమిటని ఘర్షణ పడేవాడు. ఘర్షన పడ్డ ప్రతీసారి సమీప బంధువులు వచ్చి నచ్చజెప్పేవారని స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి సైతం తండ్రి కొడుకులు అదే విష యమై ఘర్షణ పడ్డారని వారు తెలిపారు. ఇటీవల వారు నూతనంగా ఇంటిని నిర్మించుకున్నారని తండ్రి కొడుకులు ఘర్షణ పడుతున్న సమయంలో తండ్రి ఫకీరా గ్యాస్ సిలిండర్‌కు నిప్పం టించి ఇంటిని పేల్చివేస్తానని కొడుకును బెదిరించడంతో కోపోద్రిక్తుడైన కొడుకు ప్రకాశ్ అక్కడే ఉన్న గొడ్డలిని తీసుకుని ఫకీరా తలపై నరక డంతో ఫకీరా అక్కడికి అక్కడే మృతిచెందినట్లు వారు తెలిపారు. విష యం తెలుసు కున్న తండా వాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ

నవీపేట,మే24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో గత ఐదురోజులు కొనసాగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టులలో శిక్షణ అందించడం జరిగింది. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్‌లను ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు.

వర్ని : వర్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 57మంది ఉపాధ్యాయులకు పీఎల్ఎస్ శిక్షణను ఇచ్చారు. ప్రాథమిక పాఠశాల నుంచి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి దుర్కి సాయిలు ఆధ్వర్యంలో ఈ శిక్షణను ఇచ్చారు. విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన మండల రిసోర్స్‌పర్సన్‌లు సంతోష్, రాజ్ కమల్, రఘుపతి, స్వప్న, గంగారాజు, శివాని, స్పందన, మీనా తదితరులు శిక్షణ ఇచ్చారు.

కమ్మర్‌పల్లి : విద్యార్థులకు కృత్యాలద్వార విద్యా బోధన చేసినప్పుడే మెరుగైనఅభ్యాస ఫలితాలు వస్తాయని ఆ దిశగా ప్రతిఒక్కరు కృషిచేయాలని కమ్మర్‌పల్లి మండల విద్యాధికారి, కోర్స్ డైరెక్టర్ ఎన్ ఆంధ్రయ్య అన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను పెంపొందించే నిమిత్తం విద్యాశాఖ ఆధ్వర్యంలో గత ఐదురోజులగా స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



లక్ష్మాపూర్‌లో ముగ్గు పోస్తున్న దృశ్యం

మోస్రా,మే24(ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల స్థలంలో భూమిపూజ చేసి ముగ్గు పోయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడ్డోల్ల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హైమద్, కమిటీ సభ్యులు చింతం సంజీవ్, ఎల్లప్ప, గడ్డం సాయిలు, అనురాధ, కారేగాం తండా మాజీ సర్పంచ్ దేవిసింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్, కారోబార్ బాలు, లబ్దిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం లేకుండా కేసులు పరిష్కరించుకోవాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి



న్యాయ చైతన్య సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి

ఆర్మూర్ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న కేసులను ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా ఉభయుల ఒప్పందాల ప్రకారం పరిష్కరిం చుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి అన్నారు. శనివారం పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల సంఘంలో మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన చైతన్య సదస్సులో ఆమె మాట్లాడుతూ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కేసులను పరిష్కరించుకోవడంతో ఉభయులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. విశ్రాంతి ఉద్యోగులు ప్రజలను చైతన్య పర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి,గౌరవ అధ్యక్షుడు రామ్‌రెడ్డి, అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, జిల్లా కార్యదర్శి కరుణసాగర్‌రెడ్డి,రాజేశ్వర్‌రెడ్డి, గంగారాం, హరినారాయణ, గంగారెడ్డి, సుధాకర్‌గుప్తా, బ్రహ్మయ్య, రవీంద్రమోహన్, ముత్తెన్న, సుదర్శన్, ఓబన్న, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన సీనియర్ సివిల్‌న్యాయాధికారి

ఆర్మూర్ టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ గ్రామంలో లాలన వృద్ధాశ్రమాన్ని సీనియర్ సివిల్‌జడ్జ్ శ్రీదేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులను ఆప్యాయంగా పలుకరించి వారి బాగోగులను తెలుసుకున్నారు. ఆమె వెంట బాబాగౌడ్, నివేదన్, శంకర్‌గౌడ్, వృద్ధాశ్రమ నిర్వహకురాలు సునీత, న్యాయసేవ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

కోటగిరి,మే24(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ రావు మాట్లాడుతూ వేసవికాలంలో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ శిబిరం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. పదిహేను రోజుల పాటు యోగా, డ్యాన్స్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, మ్యూజిక్, గేమ్స్ శిబిరం నిర్వహించడం పిల్లల సర్వతో ముఖాభివృద్ధికి సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ విశ్వనాథ్, సాయిలు, ప్రభాకర్, కేవీ మోహన్, రాంసింగ్ పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో గత 15రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, నృత్యాలు, డ్రాయింగ్, గానం వంటి అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా శిక్షణలో తాము నేర్చుకున్న పలు అంశాలు, కృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్, శివ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో భజన

బీర్కూర్, మే 24 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని స్థానిక హనుమాన్ ఆలయ సన్నిధిలో గత సోమవారం అఖండ హరి నామ సప్తహా కార్యక్రమం ప్రారంభమైంది. ఇందులో భాగంగా శుక్ర వారం భజన చేశారు. ఈ కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగనుంది.

నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో బోధించడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వా నిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నందకిషోర్ తెలి పారు. అభ్యర్థులు ఈనెల 29 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

బ్రహ్మంగారి ఆలయంలో పూజలు

గాంధారి, మే 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా శనివారం విశ్వబ్రాహ్మణులు పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కమ్మరి నాగరాజు, సీపీఎం సాయిలు, కమ్మరిసాయిలు, రమేష్, సాయి లు భజనశంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్ ఆలయ పూజా సామగ్రి వేలం



వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

నిజామాబాద్ కల్చరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ, ధర్మాదాయ శాఖ పెద్దరాం మఠం అనుబంధ దేవాలయమైన సారంగాపూర్ హనుమాన్ దేవాలయ పూజాసామాగ్రి, పార్కింగ్ వేలం పాటను శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు నిర్వహిం చారు.

● పెద్ద ఎత్తున్న పాల్గొన్న వ్యాపారులు

సారంగపూర్ హనుమాన్ దేవాలయంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకు రాలు కమల ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో పెద్ద ఎత్తున వ్యాపారస్తులు పాల్గొ న్నారు. రెండు సంవత్సరాల కాలపరిమితితో కొబ్బరికాయలు, పూజాసామాగ్రి అమ్ముకోవ డానికి నిర్వహించిన వేలం పాటలో బి.నర్సింలు 6లక్షల 54వేల రూపాయలు పాట పాడి టెండర్‌ను దక్కించుకున్నాడు. అలాగే శ్రావణమాసం నెల రోజుల పాటు భక్తుల సౌక ర్యార్థం వాహన పార్కింగ్‌కు నిర్వహించిన వేలంపాటలో శ్రీనివాస్ రూ.76వేలకు టెండర్ దక్కించుకు న్నాడు. గతంలో పూజాసామాగ్రి, కొబ్బరికాయల టెండర్ నిర్వహించగా ఒక సంవత్సర కాల పరిమితికి ఒకలక్షా 85వేల రూపాయల ఆదాయం సమకూరిందని దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల తెలిపారు. అదేవిధంగా వాహన పార్కింగ్‌కు గత సంవత్సరం రూ.15వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిట్ పర్సన్ రాములు, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాలలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



చౌదారపు శ్రీనిక | పెద్దపాటి ప్రణీత | ఎస్.ప్రణీత్ | ఇ.శ్రీనిత | నందగిరి దీప్తి

నిజామాబాద్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్-2025 ఫలితాలలో జిల్లాకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులతో సత్తా చాటారు. శనివారం విడుదలైన పాలిసెట్ ఎంపీసీ స్ట్రీమ్‌లో నగరంలోని ఎస్ఆర్ స్కూల్ విద్యార్థిని చౌదారపు శ్రీనిక 118 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధిం చింది. నగరంలోని ఆర్చిడ్ స్కూల్ విద్యార్థిని పెద్దపాటి ప్రణిత ఎంపీసీ స్ట్రీమ్‌లో 114 మా ర్కులతో రాష్ట్రస్థాయిలో 105వ ర్యాంకు సాధించింది. బాడ్సికి చెందిన షేరు ప్రణిత్ 113 మార్కులతో ఎంపీసీ స్ట్రీమ్‌లో 141వ ర్యాంకు, బైపీసీ స్ట్రీమ్‌లో 112 మార్కులతో 91వ ర్యాం కు సాధించాడు. నర్సింగ్‌పల్లికి చెందిన బైపీసీ స్ట్రీమ్‌లో ఎదులయ శ్రీనిత 113 మార్కులతో రాష్ట్రస్థాయిలో 65వ ర్యాంకు సాధించింది. ఎంపీసీ స్ట్రీమ్‌లోనూ 113 మార్కులతో రాష్ట్రస్థా యిలో 145వ ర్యాంకు సాధించింది. రెంజల్ మండలం కందకుర్తికి చెందిన నందగిరి దీప్తి బైపీసీ స్ట్రీమ్‌లో 112.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో 74వ ర్యాంకు, ఎంపీసీ స్ట్రీమ్‌లో 112 మార్కులతో 194వ ర్యాంకు సాధించింది. జిల్లా వ్యాప్తంగా మే 13న నిర్వహించిన పాలిసెట్ పరీక్షకు మొత్తం 6,111 మంది విద్యార్థులు హాజరుకాగా ఎంపీసీ స్ట్రీమ్‌లో 4,817 మంది అర్హత సాధించారు. బైపీసీ స్ట్రీమ్‌లో 4,939 మంది అర్హత సాధించారు.

ఘనంగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు తాహెర్‌బిన్ హందాన్, కేశవేణు

నిజామాబాద్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి):పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్, రత్నాకర్, దయాకర్‌గౌడ్, తదితరులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నగరంలోని బాపూజీ వచనా లయంలో అధ్యక్షుడు భక్తవత్సలం ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమ వుతున్న యు వతీ యువకుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యక్షుడు భవంతి దేవిదాస్, ప్రధాన కార్యదర్శి మీసాల సుధాకర్‌రావు, లక్కంరెడ్డి, ప్రతాప్ రుద్ర, లక్ష్మీనారాయణ, బంటుబలరాం పాల్గొన్నారు. మహేష్‌కుమా ర్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని స్నేహ సొసైటీలో అనాథ పిల్లలతో కేక్ కట్ చేయించి పండ్లు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

● యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అల్పాహారం

టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో 250 మందికి అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈసా పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి నూతన తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

కమ్మర్‌పల్లి, మే 24: కమ్మర్‌పల్లి మండల నూతన తహసీల్దార్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన జి ప్రసాద్ శనివారం కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్లు, తదితర విషయాలపై ఆయనతో చర్చించారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలి

సుభాష్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి): రైతులు వర్షాకాలం సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త వహించాలని టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ రాపెల్లి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్‌కు సంబంధించిన పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయరాదన్నారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకరాదన్నారు. ప్రమాదకరంగా ఉన్నటువంటి వైర్లను గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి టీజీఎన్‌పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేసి తెలిపాలన్నారు.ఇళ్లలోబట్టలు ఆరవేసే జేఐ వైర్‌ల వల్ల విద్యుత్‌ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్లాస్టిక్ వైర్లనే ఉపయోగించాలన్నారు.ఇంటి ముందు ఉన్నరేకులలో సైతం విద్యుత్ సరఫరా అయ్యే అవకాశంఉంద ని విద్యుత్ సరఫరా అయ్యే వైర్లను ఎట్టిపరిస్థితుల్లో దండంలకు, రేకు లకు తగలకుండా జాగ్రత్త వహించాలన్నారు. పశువుల యజమానులు మేతకు తీసుకెళ్లినప్పుడు కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు, స్థంబాల వద్దకు వెళ్ల కుండా జాగ్రత్తలు వహించాలన్నారు. సమస్యలు ఉంటే విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

జిల్లా సమైక్య ఏపీడీ, డీపీఎంలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు


నిజామాబాద్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి):జిల్లా సమైక్య ఏపీడీ, డీపీఎంలపై చర్యలు తీసుకోవాలని జిల్లా సమైక్య సభ్యులు శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఆర్‌డీవో పీడీకి, మండల అధ్యక్షులకు తెలియకుండానే జిల్లా జనరల్ బాడీ సమావేశాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఏపీడీ, డీపీఎంలు అన్ని తామై అన్న విధంగా వ్యవహరిస్తున్నారని మండల ఓబీలకు తెలియకుండా మండల సమావేశాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఇలా చేయడం తప్పని ప్రశ్నిస్తే ఈసీ మెంబర్లు పీడీకి లెటర్లు ఇస్తున్నారని అన్నారు. గత 18ఏళ్లగా డీపీఎం అదే పోస్టులో కొనసాగుతున్నారని, ఏపీడీ అసభ్యంగా మాట్లాడుతున్నారని తెలిపారు. జిల్లా సమైక్య జనరల్ బాడీ మీటింగ్‌లో నవీపేట మండల సమైఖ్యను బహిష్కరించారని, జిల్లా అధ్యక్షురాలు చెప్పిన అదే తప్పు చేస్తున్నారని కావున వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడా అకాడమీకి ఎంపిక కోసం దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ తెలంగాణ ఆధ్వర్యంలో వివిధ అకాడమి వసతి గృహాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ముత్తెన్న శనివారం తెలిపారు. జూన్1 నుంచి 13 వరకు వివిధ అకాడమీలో ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల బాలురు, బాలికలు వాలీబాల్ అకాడమీ కోసం సిద్దిపేట్‌లో జూన్1న, సైక్లింగ్ రెజ్లింగ్ కోసం జూన్ 10, 11న, హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్‌లో జిమ్నాస్టిక్, స్విమ్మింగ్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్ హన్మకొండలోని జెఎం స్టేడియంలో 10, 11న, జూన్ 12న వనపర్తి హాకీ అకాడమిలో ఎంపి కలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ వయస్సుల విభాగంలో ఈ ఎంపి కలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో ఎస్ఎస్ఎఫ్ సబ్ జూని యర్ మరియు ఎస్‌జీఎఫ్ నేషనల్‌లో పాల్గొన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలన్ని, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్‌కార్డు వెంటతెచ్చుకో వాలన్నారు. మిగతా వివరాల కోసం 9701177144 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పార్టీ అధినేత కేసీఆర్‌కు కవిత రాసిన లేఖను సమర్థిస్తున్నాం

● మాజీ ఎంపీపీ రమేష్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ నాయక్

సుభాష్‌నగర్, మే 24 (ఆంధ్రజ్యోతి):పార్టీ అధినేత కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖను తాము సమర్థిస్తున్నామని మాజీ ఎంపీపీ, పార్టీ నేత రమేష్ నాయక్ అన్నారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పటిష్ఠ కోసం ఎమ్మెల్సీ కవిత కృషి చేస్తున్నారని అన్నారు. నిత్యం కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నారని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో శాసన మండలిలో ఎండగట్టారని అన్నారు. ఆమె లేఖలో రాసిన అంశాలకు అనుగుణంగా కోవర్ట్‌లను గుర్తించాలన్నారు. కింది స్థాయి కార్యకర్తలను గుర్తించడంతో పాటు తగిన అవకాశాలను కల్పించాలన్నారు. క్యాడర్‌కు దూరంగా ఉన్న నేతలను గుర్తించడంతో పాటు పని చేసే వారికి అవకాశాలు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారని అన్నారు. ఆమె పార్టీలో ఉంటూనే ఈ విషయాలను ప్రస్తావించారని అన్నారు. ఆమె బీఆర్ఎస్‌కు అనుకూలంగానే నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌ను బలపర్చాలనే ఉద్దేశంతోనే ఆమె ముందుకు వెళ్తు న్నారని అన్నారు. పార్టీలో ఉంటూ కోవర్ట్‌గా పనిచేస్తూ ఇతర పార్టీలకు సమాచారాన్ని చేరవేసే వారిని గుర్తిస్తే మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అనవసరంగా జబ్బలు చర్చుకోవాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో దీకొండ సుధీర్, శ్రీనివాస్ గుప్త, పరుశురాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

డిచ్‌పల్లి,మే 24(ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు. డిబార్ అయిన విద్యార్థుల్లో బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, కామారెడ్డి వశిష్ట డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయినట్లు ఆయన తెలిపారు. మొత్తం 32 పరీక్ష కేంద్రాల్లో 13482 అభ్యర్థులకు గాను 12478 హాజరుకాగా 1002 మంది గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 7017 మందికి గాను 6408 మంది హాజరుకాగా 609 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చంద్రశేఖర్ తెలిపారు.

దివ్యాంగుల కమిటీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల హక్కుల నియమావళి 2018, దివ్యాంగుల హక్కుల చట్టం 2016 సెక్షన్ 101 (1), (2) ప్రకారం జిల్లాస్థాయిలో దివ్యాంగుల కమిటీని ఏర్పాటు చేసేందుకు దివ్యాంగులు, దివ్యాంగుల అసోసియేషన్స్, ఫోరమ్స్, ట్రస్ట్ సంఘాల ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారిణి రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వేతర అభ్యర్థులు, దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్న వారి నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తామని ఈ కమిటీలో ఎస్సీ వర్గానికి లేదా ఎస్టీ వర్గానికి ఒకరు, మహిళా అభ్యర్థి ఒకరు, మిగిలిన సభ్యులు ముగ్గురు ఉంటారని అన్నారు. ఈ నెల 31లోగా జిల్లా మహిళా శిశుసంక్షేమ కార్యాలయంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన వారు తమ దరఖాస్తులను అందజేయాలన్నారు.

భవిత కేంద్రాలకు నిధుల విడుదల

నిజామాబాద్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి):సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా నిర్వహిస్తున్నటువంటి భవిత కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు సీఎంవో శ్రీనివాస్‌రావు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలను ఆరోగ్యపరంగా, విద్యాపరంగా ప్రోత్సహించేందుకు మండలాలు, డివిజన్‌లలో భవిత కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో 29 భవిత కేంద్రాలు ఉండగా వాటిలో వివిధ మరమ్మతులు, పేయింటింగ్స్, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు విడుదల అయ్యాయి. జిల్లాకు రూ.68లక్షల 5,517 విడుదలైనట్లు ఆయన తెలిపారు. లక్ష నుంచి 7లక్షలలోపు అవసరాన్ని బట్టి ఒక్కో భవిత కేంద్రానికి ఈ నిధులను వినియోగిస్తూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు.

చెరువులో పడి గిరిజన యువతి మృతి

డిచ్‌పల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంపల్లి తండాకు చెందిన రాథోడ్ సుకున (45) మతిస్థిమితం లేక చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. మృతురాలి భర్త సూదం నాయక్ ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామా చేసి పోస్టుమార్టంకు తరలించామన్నారు. డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముప్కాల్,మే 24(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మంటలు అంటుకొని చికిత్స పొందుతూ దాసపద్మ (50) మృతిచెందిన ఘటన ముప్కాల్ మండలం వేంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 18న రాత్రి తన ఇంట్లో కరెంట్ బోర్డులో స్విచ్‌ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్ తగిలి మంటలు అంటుకున్నాయి. వెంటనే బయటకు వచ్చి దాసపద్మ కేకలు వేయడంతో గ్రామస్థులు మంటలు ఆర్పి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో కాలిన గాయాలతో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కూతురు లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి



ధర్పల్లి డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తీస్తున్న సఫాయి కార్మికులు

ధర్పల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో రానున్న వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ధర్పల్లి ఈవో శ్రీనివాస్ తెలిపారు. శనివారం గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 30 మంది సఫాయి కార్మికులతో గ్రామంలో పేరుకుపోయిన చెత్తను డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ప్రొక్లెయినర్, కార్మికులచే అన్ని కాలనీల్లో డ్రైనేజీ శుభ్రం చేశారు. డ్రైనేజీలో చెత్త నిండిపోవడంతో మురికి నీరు అంతా రోడ్లపైకి వచ్చి దుర్గంధభరితంగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి నుంచే అంటువ్యాధులు ప్రబలకుండా విషజ్వరాలు రాకుండా డ్రైనేజీలో క్రిమిసంహార రసాయన పిచికారీ సైతం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ స్పెషల్ డ్రైవ్ మరో రెండు రోజుల పాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.గ్రామస్తులు ప్లాస్టిక్ వస్తువులను డ్రైనేజీలో వేయకుండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ చెత్త సేకరణకు వచ్చినప్పుడు అందులో వేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారం కోసం రైతాంగం పోరాటాలకు సిద్ధం కావాలి

సిరికొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం రైతులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ పిలుపునిచ్చారు. ఏఐయూకేఎస్ సభ్యత్వ నమోద కార్యక్రమాన్ని సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో రామకృష్ణ శనివారం ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభు త్వం పూర్తిగా రైతు వ్యతిరేకంగా విధానాలను అవలంబిస్తున్నోందన్నారు. కొత్తగా రైతు వ్యతిరేక చట్టాలనుతెచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌లకు దారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఈకార్యక్రమంలో నాయకులు లిం బాద్రి, నారగౌడ్,రాంజీ,భూమగౌడ్,ఎర్రన్న,బాల్‌రెడ్డి, అనీస్,కిషోర్ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో తనిఖీలు చేసిన అధికారులు



సిరికొండ పీఏసీఎస్‌లో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

సిరికొండ మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాను సారంగా సిరికొండ మండలం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో నిలువ ఉన్న ఎరువులను పరిశీలించి జిల్లా ఉన్నాతాధికారులకు నివేదికను పంపించారు. సిరికొండ తహసీల్దార్ రవీం దర్‌రావు, మండల వ్యవసాయ అధికారి నర్సయ్య తదితరులు సిరికొండ,తూంపల్లి,గడ్కోల్ సంఘాల్లో నిలువ ఉన్న ఎరువులను తనిఖీ చేసి వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు.గోడౌన్‌ల కెపాసిటీ, మం డలంలో పంటల సాగు విస్తీర్ణం,కావలసిన ఎరువల వివరా లను నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం మండలంలో 31 మె ట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ 48 మెట్రిక్ టన్నులు, మరి యు కాంప్లెక్స్ ఎరువులు 74మెట్రిక్ టన్నులు సిరికొండ, తూంపల్లి, గడ్కోల్ సంఘాల్లో నిలువ ఉన్నదని వ్యవ సాయ అధికారి నర్సయ్య తెలిపారు.వానకాలం పంటలకు కావలసిన ఎరువుల అవసరాన్ని జిల్లా అధికారులకు ఇండెంట్ పంపించా మని నర్సయ్య తెలిపారు.వీరితోఏఈవోలు, పీఏసీఎస్ సీఈవోలు ఉన్నారు.

మిర్దాపల్లి సబ్‌సెంటర్‌ను తనిఖీ

ఆలూర్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం మిర్దాపల్లిలోని సబ్‌సెంటర్‌ను శనివారం డిప్యూటి డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చిన్నపిల్లలకు వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనురాధ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలు అందించేందుకు సీఎంసీ కృషి

డిచ్‌పల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంత ప్రజానికానికి వైద్య సేవలు అందించడమే క్రిస్టియన్ మెడికల్ కళాశాల ముఖ్య ఉద్దేశ్యమని కళాశాల చైర్మన్ డాక్టర్ షన్ముకం మహాలింగం అన్నారు. శనివారం నిజామాబాద్‌లోని ఐఎంఏ, క్రిస్టియన్ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని మెంట్రాజ్‌పల్లి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ షన్ముకం మహాలింగం మాట్లాడుతూ గ్రామాల్లో డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు విజృంభించే సమయంలో ఇలాంటి వైద్య సేవలు నిర్వహించడం గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఐఎంఏ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని త్వరలో మెడికల్ కళాశాలకు ఆసుపత్రి, వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. చుట్టుపక్కల గ్రామీణ ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణలో మళ్లీ కరోనా వైరస్ వ్యాపిస్తున్నందున జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారు వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ 30వేల రూపాయల విలువ చేసే ఉచిత మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పాండు, మోతిలాల్, ప్రతిభ, శిల్ప, వికాస్, సుప్రజ, అనిశ్, శ్రీధర్, విశాల్, టెక్నిషియన్‌లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు

● వ్యాపారులకు ట్రాఫిక్ ఏసీపీ సూచన



దేవిరోడ్ వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ పోలీసులు

నిజామాబాద్ అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి):నగరంలోని గంజ్ గేట్-1 నుంచి దేవిరోడ్ వరకు దుకాణా సముదాయాల యజమానులతో, తోపుడు బండ్ల యజమానులతో శనివారం ట్రాఫిక్ పోలీసులు సమావేశం నిర్వహించారు. సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు. ప్రతీ దుకాణా యజమానులు వారి దుకాణాలలోనే వ్యాపారం నిర్వహించుకోవాలని ఎట్టి పరిస్థితుల్లో ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపారాలు చేయవద్దన్నారు. వాహనాలను రోడ్డు మీద అక్రమ పార్కింగ్ చేయవద్దని, తోపుడు బండ్లను ఇష్టం వచ్చినట్లు రోడ్లపై పెట్టవద్దని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ వ్యాపారులను కోరారు. వ్యాపారులు సామాగ్రిని ఫుట్‌పాత్‌పై ఉంచితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వ్యాపారుల సలహాలు, సూచనలు తీసుకున్నారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ సీజ్



అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న అటవీ శాఖ సిబ్బంది

సిరికొండ, మే 24(ఆంధ్రజ్యోతి): సిరికొండ రేంజ్ పరిధిలోని తాటిపల్లి బీట్‌లోని అటవీ భూమిని ఆక్రమించుకుని చదును చేస్తున్నారన్న అందిన సమాచారం మేరకు తమ సిబ్బంది వెళ్లి పట్టుకున్నట్లు రేంజ్ అధికారి రవీందర్ తెలిపారు.తాటిపల్లి బీట్‌లో కంపార్టుమెంటు నంబర్ 56లో జినిగ్యాల తండాకు చెందిన సవాయిలాల్ అటవీ భూమిలో చదును చేస్తున్నారని అందిన సమాచారం మేరకు తమ సిబ్బంది దాడిచేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారి తెలిపారు.పట్టుకున్న ట్రాక్టర్‌ను సిరికొండ పోలీస్‌స్టేషన్‌కు తీసుకోచ్చామని ఆయన తెలిపారు. సవా యిలాల్‌పై కేసు నమోదు చేసినట్లు రేంజ్‌అధికారి తెలిపారు. సిరికొండ అటవీ శాఖ రేంజ్‌లో ఎక్కడ అటవీ భూమిని ఆక్రమించిన, చదును చేసిన కఠినంగా శిక్షిస్తామని, ట్రాక్టర్లను సీజ్ చేస్తామని రేంజ్ అధికారి రవీందర్ హెచ్చరించారు. అటవీ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తులపై, ట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఇస్లాంపురలో తాగునీటి ఎద్దడి

● పట్టించుకోని సచివాలయ సిబ్బంది



నీటిని తీసుకెళ్తున్న కాలనీవాసులు

డిచ్‌పల్లి,మే 24(ఆంధ్రజ్యోతి):గత పది రోజులుగా ఇస్లాంపుర కాలనీలో తాగునీటి కోసం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని కులాయి ద్వారా నీళ్లు రాక నిత్యం దాహార్తిని తీర్చుకునేందుకు ట్యాంకర్‌తో పాటు వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తూ దాహార్తిని తీర్చుకుంటున్నట్లు కాలనీవాసులు తెలిపారు. గత కొంతకాలంగా కులాయిల నీరు కొందరికే రావడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఇస్లాంపుర కాలనీవాసులకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd., Bodhan branch, agreed to accord loan to Borrower : ABDUL ANWAR S/o ABDUL RAHEEM, Age 49 Years, Occ: Business, R/o H.No.3-4-176, Theer Gally Bodhan Town & Mandal, Nizamabad Dist, Property holder: ABDUL WAHEED S/o ABDUL RAHEEM, Age 52 Years, Occ: Business, R/o H.No. 3-4-165, Theer Gally, Bodhan Town & Mandal, Nizamabad Dist. by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 5 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan.

Schedule

The Existing M.T. Roofed House Bearing Municipal No. 3-4-180 (part area) Total Area of admeasuring 130.13 Sq.yards Situated at Theer Gally, Bodhan Town & Mandal, Nizamabad Dist. Under the Jurisdiction of Registration Dist Nizamabad Sub Dist Bodhan

Bounded as under:

East: House of Sri Syed Ghouse & House of Sri Mahebodb, **West:** 10'.0" Wide Lane & Part open place of Mpl No. 3-4-180, **North:** House of Sri Mahebodb & part open place of Mpl. No. 3-4-180, **South:** Joint wall House of Sri Abdul Qayyum

Sd/- SUBBA RAO, B.Sc.LLB
Advocate,Bodhan. Ph:9440004201

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd., Bodhan branch, agreed to accord loan to Borrower : ANNEBOYI GANGADHAR S/o POSHETTY Age 51 Years, Occ : Business, R/o H.No. 2-126 Pegadapally Village, Bodhan Mandal, Nizamabad Dist, Property holder: ANNEBOYI GANGADHAR S/o POSHETTY Age 51 Years, Occ : Business, R/o H.No. 2-126 Pegadapally Village, Bodhan Mandal, Nizamabad Dist, by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 5 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan

Schedule

The Existing open place bearing G.P. No. 2-136/1 (Assessment No. 933) Total Area of admeasuring 843.33 Sq.yards. Situated at Pegadapally Village, Bodhan Mandal, Nizamabad Dist. Under the Jurisdiction of Registration Dist Nizamabad Sub Dist Bodhan

Bounded as under:

East: House of Sri.Gundaram Shankar, **West:** Open place of Sri. Donakanti Yella Reddy, **North:** G.P. Road & open place of Donakanti Saya Reddy, **South:** G.P. Road & House of Sri. Kume Makku Gonda & Mangali Poshetty.

Sd/- SUBBA RAO, B.Sc.LLB
Advocate,Bodhan. Ph:9440004201

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.250	రూ. 270

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97,200	రూ.89,700	రూ.1025

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) (10.05, 4.20, 10.35)
: సింగిల్ (1.35, 7.50)
స్క్రీన్-2 : లిలో అండ్ స్టిచ్ (3డి తెలుగు) (11.30, 2.00)
: ఏఎస్ (4.30, 10.20)
: ఒక బృందావనం (7.40)
స్క్రీన్-3 : భూల్ చౌక్ మాఫ్ (హిందీ) (11.35, 8.00, 10.40)
: ఫైనల్ డిస్టినేషన్ బ్లడ్ లైన్స్ (ఇంగ్లీష్) (2.15)
: హిట్-3 (4.45)
స్క్రీన్-4 : వీరరాజు 1991 (11.00)
: వర్షం (రీరిలీజ్) (1.40)
: ఫైనల్ డిస్టినేషన్ బ్లడ్ లైన్స్ (ఇంగ్లీష్) (5.00, 10.10)
: శుభం (7.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఏఎస్ (1.30, 7.35)
: మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (4.30, 10.30)
స్క్రీన్-2: ఒక బృందావనం (11.00)
: సింగిల్ (1.30, 5.00, 7.30, 10.30)
స్క్రీన్-3 : లిలో అండ్ స్టిచ్ (ఇంగ్లీష్ 3డి) (1.30, 7.30)
: ఒక బృందావనం (4.30, 10.20)

లలితామహల్ : వర్షం (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : సింగిల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏఎస్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్